సాక్షి
కామారెడ్డి
గురువారం । 17 । జూలై । 2025



పులి కోసం వెతుకులాట

పులి జాడ కనిపెట్టేందుకు అటవీ అధికారులు గాలింపు కొనసాగిస్తున్నారు. మరిన్ని ట్రాక్ కెమెరాలు ఏర్పాటు చేశారు.

- 9లో ▸



ఇళ్లకు ఉచితంగా ఇసుక

పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకుంటే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా ఇస్తామని కలెక్టర్ తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.1 /23.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ప్రాదేశిక స్థానాల లెక్క తేలింది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో మండల, జిల్లా పరిషత్ స్థానాల లెక్క తేలింది. 25 మండలాలకు ఎంపీపీ, జెడ్పీటీసీలు ఉంటారు. అలాగే 233 మండల ప్రాదేశిక స్థానాలు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. వీటి ఆధారంగా ఎన్నికలకు వెళ్లనున్నారు.

బాలికల పాఠశాలను దత్తత తీసుకున్న స్వచ్ఛంద సంస్థ



పిట్లం: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలను బుధవారం హైదరాబాద్‌కు చెందిన సేవ్ ద గర్ల్ చైల్డ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సందర్శించారు. పాఠశాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ సంస్థ చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. ఆయన స్వస్థలం పిట్లం. సంస్థ ప్రతినిధులు పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల భవనానికి రంగులు వేయడంతోపాటు విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు స్రవంతి, శరణ్య, గీతానంద్, స్వప్న రాగి, రమేశ్ బాబు, హరిప్రకాశ్, ప్రదీప్‌రెడ్డి, నాగేంద్ర, వంశీకృష్ణ, రాజేంద్ర పల్నాటి, ఎంఈవో దేవ్‌సింగ్, పాఠశాల హెచ్‌ఎం రమణారావు పాల్గొన్నారు.

'ఆర్థిక స్వావలంబన సాధించాలి'



బాన్సువాడ రూరల్: ప్రభుత్వం, బ్యాంకులు అందిస్తున్న సహకారంతో మహిళలు వృత్తి, వ్యాపారాల్లో రాణించి ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బుధవారం బాన్సువాడలోని ఎస్‌ఎంబీ ఫంక్షన్ హాల్‌లో ఇందిర మహిళాశక్తి సంబురాలు నిర్వహించారు. నియోజకవర్గంలోని 3,719 డ్వాక్రా సంఘాలకు సంబంధించిన 2024–25 వడ్డీరాయితీ డబ్బులు రూ.3.76 కోట్ల చెక్కును ఆయా సంఘాలకు అందించారు. మరణించిన ఆరుగురు మహిళా సంఘాల సభ్యుల కుటుంబాలకు మంజూరైన రూ. 60 లక్షల బీమా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ గురుకుల పాఠశాలలకు కిరాణ సరుకులు సరఫరా చేయడానికి డ్వాక్రా సంఘాలు ముందుకు వస్తే అధికారులతో మాట్లాడి ప్రోత్సహిస్తానన్నారు. కార్యక్రమంలో ఆగ్రో చైర్మన్ బాల్‌రాజ్, సబ్‌కలెక్టర్ కిరణ్మయి, డీఆర్‌డీవో సురేందర్, బీర్కూర్ ఏఎంసీ చైర్‌పర్సన్ దుర్గం శ్యామల తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల పరిధిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విల్లారెడ్డి సీహెచ్‌సీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్(గైనిక్) పోస్టులు రెండు, అనస్థీషియా ఒకటి, బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో పీడియాట్రిషియన్ ఒకటి, జనరల్ జీడీఎంవో రెండు, మద్నూర్ సీహెచ్‌సీలో జనరల్ సర్జన్ ఒకటి, జనరల్ జీడీఎంవో ఒక పోస్టు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన వైద్యులు ఈనెల 21వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 23న ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

'సర్కారు బడులను బతికించుకోవాలి'



మాచారెడ్డి : సర్కారు బడులను బతికించుకోవాలని డీఈవో రాజు కోరారు. బుధవారం నెమిలిగుట్ట తండాలో నూతనంగా ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికిగాను మాచారెడ్డి మండలంలో పాఠశాలల్లో 6 వందలకుపైగా విద్యార్థులు చేరారన్నారు. మండలానికి చెందిన 28 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో దేవేందర్‌రావ్, ఏఎంవో వేణు శర్మ, హెచ్‌ఎంలు వెంకటాచారి, భాస్కరశర్మ, ఉపాధ్యాయుడు మాణిక్యం, సీఆర్పీలు సంజీవ్, నరేశ్, శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు నాసీలాల్, నర్సింలు, రవినాయక్ పాల్గొన్నారు.

తెయూ విజయాలు ఆదర్శం

- రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన తెలంగాణ యూనివర్సిటీ
- ఇక్కడి ప్రజల ఆకాంక్షలు, సామర్థ్యాలు వర్సిటీ అభివృద్ధిలో స్ఫూర్తినిస్తున్నాయి
- రెండో స్నాతకోత్సవంలో వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ముఖ్యఅతిథిగా హాజరైన ఐఐసీటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్
- 113 మందికి గోల్డ్ మెడల్స్.. 157 మందికి డాక్టరేట్‌లు అందజేత



తెయూ కాన్వొకేషన్ వేదికపై జాతీయ గీతం ఆలపిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐఐసీటీ మాజీ డైరెక్టర్ శ్రీవారి చంద్రశేఖర్, వీసీ యాదగిరిరావు తదితరులు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రం పేరుతో ఏర్పడిన తెలంగాణ యూనివర్సిటీకి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెయూ రెండో స్నాతకోత్సవాన్ని(కాన్వొకేషన్) బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. 2006లో ఆరు కోర్సులతో ప్రారంభమైన తెయూ.. నేడు ఏడు విభాగాలు, 24 ఉప విభాగాలుగా 31 కోర్సులతో కొనసాగుతోందన్నారు. డిచ్‌పల్లి మెయిన్ క్యాంపస్‌తోపాటు కామారెడ్డి జిల్లా భిక్కనూరు సౌత్ క్యాంపస్, సారంగపూర్ ఎడ్యుకేషన్ క్యాంపస్‌లలో విద్యా వికాసం చెందడం ఆనందంగా ఉందన్నారు. చైతన్యవంతమైన ఈ మట్టిలోని ప్రజల ఆకాంక్షలు, సామర్థ్యాలు యూనివర్సిటీ అభివృద్ధిలో స్ఫూర్తినిస్తున్నాయన్నారు. యూనివర్సిటీ సాధించిన విజయాలు, ప్రగతిపూర్వకమైన సంఘటనలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. గత 19 ఏళ్లలో వర్సిటీ అధికారులు అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకుల ఉమ్మడి కృషి, అంకితభావం అభివృద్ధిలో ప్రతిబింబిస్తోందన్నారు.



ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

2023 – 24 రాష్ట్ర ఆర్థిక సర్వే ప్రకారం 51 శాతం పట్టభద్రులు దేశానికి నైపుణ్యాల కొరత తీరుస్తూ ఉద్యోగాలు పొందుతున్నారన్నారని గవర్నర్ వివరించారు. తెలంగాణ యూనివర్సిటీ ఆశాజనకమైన పారిశ్రామిక, విద్యాపరమైన సంబంధాలతో ముందుకు పోవడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చెప్పినట్లు విద్య యొక్క అంతిమ లక్ష్యం సృజనాత్మకమైన మానవున్ని తయారు చేయడంతోపాటు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ చారిత్రాత్మకమైన అభివృద్ధిని స్పృశించడమని పేర్కొన్నారు.

కాన్వొకేషన్‌కు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ముందుగా బెటాలియన్ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కాన్వొకేషన్‌కు రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎ మ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో తెయూ రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, డీన్స్ ఘంటా చంద్రశేఖర్, కే.అపర్ణ, జి.రాంబాబు, కే.లావణ్య, ఎం.శ్రీనివాస్, కే.సంపత్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల, ప్రొఫెసర్‌లు ఆరతి, కనకయ్య, విద్యావర్ధిని, అరుణ, ఆంజనేయులు, నాగరాజు, పీ ఆర్‌వో పున్నయ్య, ఏపీఆర్‌వో అబ్దుల్ ఖవి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.



గోల్డ్‌మెడల్ సాధించిన మల్లికకు సర్టిఫికెట్ అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ఆందోళన చెందొద్దు.. అవకాశాలను అందిపుచ్చుకోవాలి



కాన్వొకేషన్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన భారత రసాయన శాస్త్ర సాంకేతిక సంస్థ (ఐఐసీటీ) మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీవారి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. యనివర్సిటీ నుంచి బయటకు వెళ్లిన ప్రతి విద్యార్థికి ఆందోళనతో పాటు అవకాశాలు కలిగిన ఎన్నో దారులు కనిపిస్తాయన్నారు. ఆందోళన చెందకుండా అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వారి వారి శక్తి సామర్థ్యాలు, అభిరుచి మేరకు కొందరు పరిశోధకులుగా మరికొందరు పారిశ్రామికవేత్తలుగా, వ్యవస్థాపకులుగా, ప్రజాసేవకులుగా, విద్యావేత్తలుగా ఉన్నతంగా స్థిరపడుతున్నారన్నారు. విద్యార్థులు ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది జీవితమనేది పందెం లాంటిది కాదని ఇది ఒక ప్రయాణం మాత్రమేనని వివరించారు. ప్రయాణానికి సమయస్ఫూర్తితో తీసుకునే నిర్ణయాల మీద భవిష్యత్ ఆధారపడుతుందన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అన్ని రంగాలపై ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు.

బంగారు పతకాలు.. డాక్టరేట్ పట్టాలు

2014 నుంచి 2023 వరకు 15 విభాగాల్లో 130 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపగా, దరఖాస్తు చేసుకున్న 113 మందికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యఅతిథి ప్రొఫెసర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా స్నాతకోత్సవంలో బంగారు పతకాలు అందజేశారు. అలాగే 2017 నుంచి 2025 జూన్ వరకు ఏడు విభాగాల్లో పరిశోధనలు పూర్తి చేసుకున్న 157 మంది పరిశోధకులకు పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టాలను అందజేశారు.

క్షుణ్ణంగా తనిఖీలు

తెయూ క్రీడామైదానం లో ఏర్పాటు చేసిన కాన్వొకేషన్ ప్రాంగణంలో పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఆధ్వర్యంలో స్నిఫర్ డాగ్ బృందం, బాంబు డిస్పోజబుల్ టీం, ఇంటిలిజెన్స్ అధికారులు బందోబస్తు నిర్వహించారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి నిర్వహించిన లోనికి అనుమతించారు.

ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటుకు కృషి



తెయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీ.యాదగిరి రావు మాట్లాడుతూ.. వర్సిటీలో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా పరిపాలనా భవనం, 500 మంది విద్యార్థినులకు సరిపడా అన్ని రకాల వసతులు ఉండే బాలికల వసతి గృహం, వేయి మంది సామర్థ్యం కలిగిన ఆడిటోరియం, క్రీడామైదానం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెయూ పరిధిని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు విస్తరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి, జిల్లా ప్రజాప్రతినిధులతోపాటు బోధన, బోధనేతర సిబ్బంది సమష్టి కృషిపైనే ఆధారపడుతుందని అన్నారు.



బెటాలియన్‌లో మొక్కనాటి నీరు పోస్తున్న గవర్నర్, పక్కన రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి



కాన్వొకేషన్‌లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, ఆర్మూర్, అర్బన్ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ విద్యాసంస్థల అధినేతలు, ప్రొఫెసర్లు



బెటాలియన్‌లో పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులు

అక్కడ అంతా ఓపెన్!

- ఆర్టీఏ చెక్‌పోస్టుల్లో ప్రైవేటు సైన్యం
- ఏసీబీ అధికారుల కళ్ల ముందే వసూళ్ల దందా
- దాడులు జరుగుతున్నా ఆగని అవినీతి



అధికారులను విచారిస్తున్న ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రవాణా శాఖ(ఆర్టీఏ) కార్యాలయాలతో పాటు చెక్‌పోస్టులు, చెక్ పాయింట్ల వద్ద వసూళ్ల దందా ఓపెన్‌గా నడుస్తోంది. ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వారి ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని ఏసీబీ అధికారులు ప్రత్యక్షంగా చూశారు. ఇటీవల 161 వ నంబరు జాతీయ రహదారిపై సలాబత్‌పూర్ వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించిన సమయంలో ట్రాన్స్‌పోర్టు వాహనాల డ్రైవర్లు వచ్చి గల్లాపెట్టె(బాక్సు)లో డబ్బులు వేసి వెళుతుండడాన్ని గమనించారు. తాజాగా బుధవారం ఉదయం 44 వ నంబరు జాతీయ రహదారిపై పొందుర్తి వద్ద ఉన్న రవాణాశాఖ చెక్‌పాయింట్‌పై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించిన సమయంలో అక్కడ ప్రైవేటు వ్యక్తులు దర్జాగా డబ్బులు వసూలు చేస్తుండడాన్ని గుర్తించారు.

మొన్న సలాబత్‌పూర్.. నేడు పొందుర్తి..

రవాణా శాఖ చెక్‌పోస్టులు, కార్యాలయాల్లో ఏళ్లుగా వసూళ్ల దందా నడుస్తుండగా.. అప్పుడప్పుడు ఏసీబీ దాడులు చేయడం, తరువాత యథావిధిగా దందా నడవడం పరిపాటైంది. గతనెల 26న సలాబత్‌పూర్ చెక్‌పోస్టుపై దాడి చేసిన సమయంలో లారీలు, ట్రక్కుల డ్రైవర్లు చెక్‌పోస్టు దగ్గరికి వచ్చి డబ్బులు ఇచ్చి వెళుతుండడాన్ని గమనించారు. ఆ రోజు లభించిన లెక్కకు రాని డబ్బులు రూ. 91 వేలను సీజ్ చేశారు. తాజాగా పొందుర్తి చెక్‌పాయింట్ వద్ద లెక్క చూపని రూ. 80 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఎంతో రద్దీగా ఉండే 44 వ నంబరు జాతీయ రహదారిపైనున్న ఈ చెక్‌పాయింట్‌నుంచి నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. వాహనాలను ఆపకుండా, ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా ఉండాలంటే ఈ చెక్ పాయింట్‌లో మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే. ఇక్కడ ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని లారీలు, ట్రక్కులు లాంటి రవాణా వాహనాల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఏసీబీ తనిఖీల్లో వెల్లడైంది.

అంతా 'మామూలే'..

రవాణాశాఖ కార్యాలయాలు, చెక్‌పోస్టులు, చెక్‌పాయింట్లపై ఇటీవల ఏసీబీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నా వసూళ్లు మాత్రం ఆగడం లేదు. సలాబత్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఏసీబీ దాడి జరిగిన మరుసటి రోజు నుంచే వసూళ్లు యథావిధిగా కొనసాగాయి. పొందుర్తి చెక్‌పాయింట్ వద్ద కూడా ఇది 'మామూలు'గా మారింది. అవినీతికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ వసూళ్లకు అడ్డుకట్ట పడే అవకాశాలున్నాయన్న అభిప్రాయం ప్రజలనుంచి వ్యక్తమవుతోంది.

బహిరంగంగా వసూళ్లు..



లంచం ఇచ్చేందుకు వెళ్తున్న డ్రైవర్

రవాణా శాఖ కార్యాలయాలతో పాటు చెక్‌పోస్టులు, చెక్ పాయింట్ల వద్ద బహిరంగంగా వసూళ్లు చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సుల జారీ, వాహనాల రిజిస్ట్రేషన్లు.. ఇంకా వాహనాలకు సంబంధించిన ప్రతి పనికో రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లై చేసుకున్న వారు కార్యాలయానికి వెళితే ఏదో ఒక సాకు చెప్పి పనులు చేయడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలు ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. ఏజెంట్ల వ్యవస్థ లేదని అధికారులు చెబుతున్నా, అక్కడ ఏజెంట్ల రాజ్యమే కొనసాగుతోంది. సాయంత్రానికి లెక్కగట్టి ఏజెంట్లు అధికారులకు డబ్బులు అప్పజెబుతున్నారు. చెక్‌పోస్టులు, చెక్‌పాయింట్ల వద్ద సరుకు రవాణా వాహనాల డ్రైవర్లు డబ్బులు ఇవ్వడం బహిరంగంగానే జరుగుతోంది. అయితే రవాణా శాఖ అధికారులు, సిబ్బంది నేరుగా డబ్బులు తీసుకోకుండా ప్రైవేటు వ్యక్తుల ద్వారా వసూళ్లు చేస్తున్నారు.

సమస్యలకు పరిష్కారం దొరికేనా?

- నేడు జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం
- ఆస్పత్రి చరిత్రలో తొలిసారి నిర్వహణకు ఏర్పాట్లు
- పాల్గొననున్న ఎమ్మెల్యేలు
- నిధుల పక్కదారిపై చర్చించే అవకాశం



కామారెడ్డి జీజీహెచ్ భవనం

కామారెడ్డి టౌన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం సమావేశం నిర్వహించనున్నారు. జీజీహెచ్ చరిత్రలో తొలిసారి నిర్వహిస్తున్న సమావేశంపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

ఐదేళ్లలో ఆరుసార్లే..

ఆస్పత్రి అభివృద్ధి, సమస్యలపై చర్చించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి హెచ్‌డీఎస్ సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. అయితే కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదేళ్లలో ఆరుసార్లు మాత్రమే సమావేశం నిర్వహించారు. ఏరియా ఆస్పత్రిని జీజీహెచ్‌గా మార్చి మూడేళ్లవుతోంది. జీజీహెచ్‌గా మారాక తొలిసారి సమావేశం నిర్వహిస్తుండడం గమనార్హం.

కలెక్టర్ అధ్యక్షతన..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కి సంబంధించిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డీఎస్) సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఆస్పత్రిలోని మొదటి అంతస్తులోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు మీటింగ్ ప్రారంభం కానుంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ పెరుగు వెంకటేశ్వర్లు తెలిపారు. హెచ్‌డీఎస్ చైర్మన్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులైన ఎంపీ, జిల్లాలోని ఎమ్మెల్యేలను ఆహ్వానించామని పేర్కొన్నారు.

కమిటీ ఇలా..

జీజీహెచ్ హెచ్‌డీఎస్ చైర్మన్‌గా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, వైస్ చైర్మన్‌గా ఆస్పత్రి సూపరింటెండెంట్ పెరుగు వెంకటేశ్వర్లు, సభ్యులుగా ఎంపీ సురేశ్ షెట్కార్, బాన్సువాడ, కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు ఉన్నారు. సభ్యులుగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, సామాజిక కార్యకర్తలు ఉండాలి. వారి పేర్లను ఇంకా కమిటీలో చేర్చలేదు.

ఆస్పత్రి నిండా సమస్యలే..

జిల్లా కేంద్రంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో వంద పడకల ఏరియా ఆస్పత్రిగా ఉన్న భవనాన్ని డీఎంఈ పరిధిలోకి తీసుకుని 330 పడకలతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి(జీజీహెచ్)గా మార్చారు. ఇందులో 32 విభాగాలున్నాయి. అయితే భవనం ఇరుకుగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పార్కింగ్‌కు సరిపడా స్థలం లేదు. తీవ్రమైన నీటి సమస్య ఉంది. ఆస్పత్రి మార్చురి రోడ్డు అధ్వానంగా ఉంది. భవనం పాతది కావడంలో వర్షం పడితే నీరు ఊరుస్తోంది. అక్కడక్కడ పీవోపీ ఊడి పడుతోంది. ఓపీ విభాగాల గదులు ఇరుకుగా మారాయి. పాత భవనం పక్కన రేకుల షెడ్డులో చీకటిలో రక్తపరీక్షల నమూనాలను సేకరిస్తున్నారు. గర్భిణులకు వైద్య సేవలను పాత ఆయుష్ భవనం గదుల్లో అందిస్తున్నారు. సరిపడా స్థలం లేకపోవడతో ఆరుబయట గర్భిణులు, మహిళలు నిల్చోవాల్సి వస్తోంది. ఆస్పత్రిలో ఎలక్ట్రికల్ వైరింగ్ వ్యవస్థ సరిగా లేక సామగ్రి చెడిపోతోంది. ప్లంబింగ్ సమస్యలూ ఉన్నాయి. మెటర్నిటీ వార్డులో పైకప్పునుంచి పీవోపీ పడిపోవడంతో ఆ గదిలో పాత సామగ్రిని ఉంచారు. జనరల్ వార్డులో మెటర్నిటీ సేవలు అందిస్తున్నారు. రోగుల కోసం ఏర్పాటు చేసిన భవన లిఫ్ట్ నెల రోజుల నుంచి పని చేయడం లేదు.

నిధులు పక్కదారి..

ఆస్పత్రికి సంబంధించి ఆరోగ్యశ్రీ నిధులు రూ. 70 లక్షలు పక్కదారి పట్టాయన్న ఆరోపణలున్నాయి. ఆరోగ్య బీమా పథకం(ఆబా) నిధులు రూ. 20 లక్షలు, ఏఆర్‌టీ నిధులు రూ. 10 లక్షలు, డయాలసిస్ నిధులు రూ. 10 లక్షలను హెచ్‌డీఎస్ అనుమతి లేకుండానే వినియోగించారు. ఇందులో భారీగా అవకతవకలు జరిగాయని తెలుస్తోంది. గతంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేసిన అధికారితోపాటు ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జి వైద్యుడు, ఓ సీనియర్ డాటా ఆపరేటర్‌లపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఐదు నెలలుగా ఆరోగ్యశ్రీ సిబ్బంది జీతాలు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ నిధులు వినియోగం అక్రమాలు బయటపడ్డాయి. ఈ వ్యవహారంలో గత ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు సంజాయిషీ నోటీసు అందజేసినట్లు తెలిసింది. తాజాగా రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరిన అధికారి సైతం ఆ నిధుల వివరాలు, వినియోగం చిట్టా చూసి అవాక్కయినట్లు సమాచారం. ఈ అంశంపై సమావేశంలో చర్చించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

క్లుప్తంగా

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'



పాల్వంచలో మాట్లాడుతున్న జడ్జి నాగరాణి

మాచారెడ్డి : ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా జడ్జి నాగరాణి సూచించారు. పాల్వంచ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. బాలలు, మహిళల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హిమబిందు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు స్వర్ణలత, ఎంఈవో రామనోహర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్ సురేశ్ పాల్గొన్నారు.

కోడ్ హోప్ గ్లోబల్ సంస్థ సేవలు ప్రశంసనీయం



అభినందిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ రూరల్: కోడ్ హోప్ గ్లోబల్ సంస్థ సేవలు ప్రశంసనీయమని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. బుధవారం ఆమె బాన్సువాడ జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అమెరికాలో విద్యాభ్యాసంతో పాటు పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్న విద్యార్థినులు ఆలా లిఖిత, అన్యాబులుసు, బొల్లినేని పల్లవి, మీనాక్షి అరసదలు పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ ద్వారా సహాయం అందించడం అభినందనీయమన్నారు. సంస్థ ద్వారా 40 కంప్యూటర్లు, బాన్సువాడ, పాల్వంచ, సదాశివనగర్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు 2 వేల సానిటరీ నాప్కిన్స్, 15 పాఠశాలలకు ఇన్సినరేటర్లు(భస్మీకరణ పరికరం), మరో 8 పాఠశాలలకు సైన్స్‌ల్యాబ్ పరికరాలను విద్యార్థులకు అందజేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంత రావు, డీఈవో రాజు, ఎంఈవో నాగేశ్వరరావు, చందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న బోనాల పండుగకు రావాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు ఆహ్వాన పత్రికను అందించారు.మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నేతలు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, సంతోష్ తదితరులున్నారు.

బన్సల్‌తో మాజీ ఎంపీ భేటీ

బాన్సువాడ రూరల్: బీజేపీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌ను బుధవారం జహీరాబాద్ పార్లమెంట్ మాజీ సభ్యులు బీబీపాటిల్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. ఆయన వెంట బాన్సువాడ నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీనివాస్ గార్గే తదితరులు ఉన్నారు.






గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, చిత్రంలో గడుగు గంగాధర్



గవర్నర్‌కు జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

ప్రముఖులతో గవర్నర్ ఇష్టాగోష్టి

- కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్ తిలకించిన జిష్ణుదేవ్ వర్మ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం నిజామాబాద్ సమీకృత కలెక్టరేట్‌లో జిల్లాకు చెందిన ప్రఖ్యాత కవులు, కళాకారులు, రచయితలు, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన క్రీడాకారులు, సామాజిక కార్యకర్తలు, ఆదర్శ రైతులు, ఇతర ప్రముఖులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. తెలంగాణ యూనివర్సిటీ స్నాతకోత్సవం అనంతరం కలెక్టరేట్‌కు వచ్చిన గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యేలు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి, కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై తెలిపేందుకు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గవర్నర్ తిలకించారు. కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి ఫొటో ఎగ్జిబిషన్ ఆధారంగా ఆయా శాఖల కార్యక్రమాల వివరాలను తెలిపారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాకు చెందిన ప్రముఖులతో ముచ్చటించారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న వారి గురించి గవర్నర్ పేరుపేరున వివరాలు తెలుసుకొని అభినందించారు. అనంతరం గవర్నర్ ఆయా రంగాల వారితోపాటు జిల్లా అధికారులతో కలిసి ఫొటో సెషన్‌లో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వేదికపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, అంకిత్




మాట్లాడుతున్న మలావత్ పూర్ణ, గుగులోత్ సౌమ్య

గవర్నర్‌తో ఇష్టాగోష్టిలో పాల్గొన్నది వీరే..

పిన్న వయసులో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ, అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రమేశ్ కార్తీక్ నాయక్, బల్లాప్ప మల్లేశ్ (థియేటర్ ఆర్టిస్ట్), కందకుర్తి యాదవరావు (చరిత్రకారులు), చిన్ని కృష్ణుడు (ఆదర్శ రైతు), అమృతలత (ప్రముఖ రచయిత), నాశేశ్వరం శంకరం (కవి), వీపీ. చందన్ రావు (కవి, రచయిత), అష్ట గంగాధర్ (జానపద కళాకారులు), పాయల్ కోట్గిర్కర్ (ప్రముఖ తబలా వాయిద్యకారులు), పంచరెడ్డి లక్ష్మణ్ (ప్రముఖ కవి), గణపతి అశోక శర్మ (అష్టావధాని), తల్లావజ్ఝల మహేశ్‌బాబు (ప్రముఖ కవి), కాసర్ల నరేశ్ రావు (కవి, రచయిత), ఘనపురం దేవేందర్ (కవి, వ్యాఖ్యాత), డాక్టర్ డి.శారద (ప్రముఖ విద్యావేత్త, రచయిత), గంట్యాల ప్రసాద్ (సాహితీవేత్త), తిరుమల శ్రీనివాస్ ఆర్య (ప్రముఖ కవి), కత్తి గంగాధర్ (సాంస్కృతిక విభాగం విలేకరి), బోచ్కర్ ఓంప్రకాశ్ (కవి, అష్టావధాని), ఆరుట్ల శ్రీదేవి (సాహితీ పరిశోధకులు), శ్రీమన్నారాయణ చారి (కవి, ప్రముఖ వ్యాఖ్యాత), కళా లలిత (ప్రముఖ యాంకర్), బి.కళా గోపాల్ (కవి, రచయిత), మద్దుకూరి సాయిబాబు (సామాజిక సేవా కార్యకర్త, రచయిత), చింతల గంగాదాస్ (కవి, వ్యాఖ్యాత), చింతల శ్రీనివాస్ గుప్తా (ప్రముఖ కవి), డాక్టర్ అన్నందాస్ జ్యోతి (విద్యావేత్త, రచయిత), కైరకొండ బాబు (ప్రముఖ చిత్రకారులు), సిర్ప లింగం (ప్రముఖ కళాకారులు), చిందు బాబయ్య (కళాకారులు), మహమ్మద్ రషీద్ (రేలా రే రేలా ఫేం కళాకారుడు), సాయి లవోలా (జానపద కళాకారులు), జయలక్ష్మి (నాట్య గురువు), గంగాదేవి (జానపద గాయని), పసునూరి వినయ్ కుమార్ (కొరియోగ్రాఫర్), టీ స్వప్నరాణి (మ్యూజిక్ అధ్యాపకురాలు), కే సంతోష్ కుమార్ (వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్), అష్ఫాక్ ఆస్ఫీ (ఉర్దూ కవి, వ్యాఖ్యాత), దారం గంగాధర్ (రచయిత) తదితరులున్నారు.



సీనియర్ సిటిజన్‌తో ముచ్చటిస్తున్న గవర్నర్



వివిధ రంగాల ప్రముఖులు, అధికారులతో గవర్నర్



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న గవర్నర్



బెటాలియన్‌లో గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థిని

బెటాలియన్‌ను సందర్శించిన గవర్నర్



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ సాయిచైతన్య



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ యాదగిరిరావు



ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్



కమాండెంట్ సత్యనారాయణ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు బుధవారం జిల్లాకు వచ్చిన వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముందుగా డిచ్‌పల్లిలోని టీజీఎస్పీ ఏడో బెటాలియన్‌ను సందర్శించారు. గవర్నర్‌కు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, వీసీ యాదగిరి రావు, బెటాలియన్ కమాండెంట్ పీ సత్యనారాయణ, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, విద్యార్థినులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ బెటాలియన్ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. కాసేపు విశ్రాంతి అనంతరం గవర్నర్ యూనివర్సిటీకి బయలుదేరి వెళ్లారు. కాన్వొకేషన్ ముగిసిన తర్వాత గవర్నర్ తిరిగి బెటాలియన్‌కు చేరుకొని భోజనం చేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం నిజామాబాద్ నగరంలోని కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. అసిస్టెంట్ కమాండెంట్లు శరత్‌కుమార్, కేపీ సత్యనారాయణ, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పి.రమా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన సేవలు అందించాలని, సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రాలలో వైద్యులను 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలన్నారు. రోగ నిర్ధారణ చేసే పరీక్షలు చేయించాలని, ల్యాబ్ టెక్నీషియన్‌ల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. నేతలు సత్తెమ్మ, పద్మ, అనిత, పుష్పలత, యాదమ్మ, లక్ష్మి, రూప పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న పీవోడబ్ల్యూ నాయకులు

గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాలు



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న సత్యం



ఎన్. బాలు



సిద్ధ లక్ష్మి



గోల్డ్ మెడల్ అందుకుంటున్న నవీన్



కుటుంబ సభ్యులతో రూప్‌సింగ్

సాక్షి నెట్‌వర్క్:తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బుధవారం గాంధారికి చెందిన పెద్దబూరి సత్యం, కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాకు చెందిన వి.రూప్‌సింగ్, కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయకర్త ఎన్.బాలు, ఎల్లారెడ్డికి చెందిన సిద్ధ లక్ష్మికి డాక్టరేట్ పట్టాలు, తాడ్వాయికి చెందిన కొత్తపలి నవీన్ గోల్డ్‌మెడల్ అందుకున్నారు. బుధవారం డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన రెండో స్నాతకోత్సవంలో వీటిని అందుకున్నారు. బంజారా సాహిత్యం–జీవన చిత్రం అంశంపై పరిశోధన చేసినందుకు రూప్‌సింగ్‌కు, ఎకనామిక్స్‌లో ప్రతిభ చూపినందుకు బాలుకు, బీడీ వర్కర్ల జీవన శైలిపై పీహెచ్‌డీ చేసినందుకు సిద్ధ లక్ష్మికి డాక్టరేట్‌లు అందజేశారు.

ఆలయం చుట్టూ షెడ్లు వేయొద్దు



వినతిపత్రం అందిస్తున్న యువకులు

మద్నూర్: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ హనుమాన్ ఆలయం చుట్టూ ఆలయ కమిటీ వారు షెడ్లు వేసే ఆలోచనను విరమించుకోవాలని పలువురు యువకులు డిమాండ్ చేశారు. ప్రతి ఏటా ఎడ్ల పొలాల అమావాస్య రోజు ఆలయం చుట్టూ ఎడ్లను తిప్పుతారని, రథోత్సవం రోజున కూడా రథం తిరగడానికి ఇబ్బంది అవుతుందన్నారు. ఈమేరకు వారు మద్నూర్ పంచాయతీ కార్యదర్శిని కలిసి ఆలయం చుట్టూ షెడ్లు వేయకుండా నిరోధించాలని కోరారు. ఎలాంటి షట్టర్లు నిర్మించకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక'

కామారెడ్డి క్రైం: పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకుంటే ఇందిరమ్మ లబ్ధిదారులకు అవసరమైన ఇసుకను ఉచితంగా ఇస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి బుధవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు, తహసీల్దార్‌లు, ఎంపీడీవో లతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ఇసుక రవాణా గురించి ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఇసుక ఉచితంగా ఇస్తామని, రవాణా ఖర్చులు లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లభ్యత ఉన్నచోటు నుంచి ఇసుకను పొందవచ్చన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు మొరం అవసరమైన వారు పంచాయతీ కార్యదర్శి సిఫారసుతో ట్రాక్టరుకు రూ.300, టిప్పర్‌కు రూ.1,200 చొప్పున డీడీ రూపంలో చెల్లించి మొరం అనుమతులు పొందాలన్నారు. కిష్టాపూర్, హస్గుల్, కుర్ల, ఖద్గావ్, శెట్లూర్ ఇసుక క్వారీ లకు పర్యావరణ అనుమతుల చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక రవాణాను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆర్డీవోలు, మైనింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ విక్టర్, హౌసింగ్ పీడీ విజయపాల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

క్రైం కార్నర్

రైలు కింద పడి యువకుడి మృతి

బోధన్: ఎడపల్లి– జాన్కంపేట రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం గుర్తు తెలియని రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు (25) మృతి చెందినట్లు నిజామాబాద్ రైల్వేస్టేషన్ మేనేజర్ సాయి కిశోర్ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్సై సాయిరెడ్డి నంబర్ 87126 58591కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి ..

బాన్సువాడ రూరల్: తాడ్కోల్ గ్రామ చెరువులో చేపల వేటకు వెళ్లిన దేవాల్ల సాయిలు అనే వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. బాన్సువాడ పట్టణంలోని దాల్మల్‌గుట్టలో నివాస ముండే దేవాల్ల సాయిలు మేస్త్రీ పనిచేస్తూ.. పని లేనప్పుడు చేపట వేటకు వెళ్లేవాడు. ఈనెల 15న చేపల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు చెరువులో పడి ఈతరాక మృతిచెందాడు. మృతుని అక్క బషవ్వ ఫిర్యాదు మేరకు బుధవారం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

రెంజల్(బోధన్): మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన కమ్మరి శాంతమ్మ(76) చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం నిజామాబాద్ నుంచి బోర్గాం గ్రామానికి శాంతమ్మ బస్సులో వచ్చింది. బస్సు దిగుతుండగా చీర కొంగు తట్టుకొని బస్సు వెనుక టైరు కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు శాంతమ్మను నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

యువకుడి దారుణ హత్య

- ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ విఠల్‌రెడ్డి

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద మండల కేంద్రంలో బుధవారం ఓ యువకుడి దారుణ హత్య కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిచ్కుందలోని ఊరడమ్మ గల్లీకి చెందిన అడికె రమేశ్(35)కు పదేళ్ల క్రితం మహాదేవితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. గత సంవత్సరం నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో మహాదేవి పుట్టింటికి వెళ్లింది. దీంతో అప్పటి నుంచి రమేశ్ మారేదు గుడి వద్ద ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ జీవిస్తున్నాడు. కాగా, పెద్ద దేవాడకు చెందిన సమీప బంధువు కాశీనాథ్ బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి వచ్చి రమేశ్ ఇంటి తలుపు కొట్టాడు. రమేశ్ తలుపు తీయడంతో వెంటనే కాశీనాథ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీంతో రమేశ్ అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, సీఐ రవికుమార్, ఎస్సై మోహన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాశీనాథ్ భార్యతో వివాహేతర సంబంధం ఉందనే కారణంతోనే తన కొడుకును హత్య చేసినట్లు రమేశ్ తల్లి గంగామణి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

ప్రతి పుట్టిన రోజున ఒక మొక్క నాటాలి



విద్యార్థులతో అటవీ శాఖాధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

గాంధారి(ఎల్లారెడ్డి): విద్యార్థులు తమ ప్రతి పుట్టిన రోజు సందర్భంగా ఒక మొక్క నాటి సంరక్షించాలని గాంధారి ఎఫ్ఆర్వో హేమ చందన అన్నారు. బుధవారం ముదెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆమె గ్రామస్తులు, విద్యార్థులతో వన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చెట్ల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణ, ఫారెస్టు గెస్ట్ హౌస్ ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కాంగ్రెస్ నేత మోహన్, ఉపాధ్యాయులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.